మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు విడుదల

- 40 మున్సిపాలిటీలకు 112 కోట్లు మంజూరు
- పార్వతీపురానికి మొండి చేయి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: మున్సిపాలిటీలోని ప్రజలకు త్రాగునీరు సరఫరా రోడ్లు, కాలువలు, వీధిదీపాలు పార్కుల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆయా నియోజకవర్గాల శాసనసభ్యుల అభ్యర్థనతో మున్సిపాలిటీలో బిపిఎస్, ఎల్ఆర్ఎస్ (టౌన్ ప్లానింగ్) ద్వారా వచ్చిన నిధులను మున్సిపాలిటీల అభివృద్ధికి కేటాయించాలని డిటిసిపికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రీయంబర్స్‌మెంట్ ప్రాతిపదికన నిధులు విడుదలకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఆదేశాలు జారీ చేయటంతో రాష్ట్రంలోని 40 మున్సిపాలిటీలకు నూట పన్నెండు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశారు. రెండు మున్సిపాలిటీలకు కోటి రూపాయలు, 9 మున్సిపాలిటీలకు రెండు కోట్ల రూపాయలు, రెండు మున్సిపాలిటీలకు రెండున్నర కోట్ల రూపాయలు, 22 మున్సిపాలిటీలకు మూడు కోట్ల రూపాయలు, నాలుగు మున్సిపాలిటీలకు నాలుగు కోట్ల రూపాయలు, ఒక మున్సిపాలిటీకి ఐదు కోట్ల రూపాయలు చొప్పున ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. మన్యం జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో సాలూరు మున్సిపాలిటీకి రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరు అయ్యాయి. అయితే గ్రేడ్ వన్ మున్సిపాలిటీ స్థాయికి చెందిన జిల్లా హెడ్ క్వార్టర్‌లో ఉన్న పార్వతీపురం మున్సిపాలిటీకి ప్రభుత్వం మొండి చేయి చూపించింది. ఈ మున్సిపాలిటీలో వాస్తవానికి మంచినీటి సరఫరా, రోడ్లు, కాలువలు, పార్కుల అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉన్నాయన్న విషయం తెలిసి కూడా ఈ మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు ఎందుకు మంజూరు చేయలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ మున్సిపాలిటీలో తాగునీరు సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదన్న విషయం తెలిసి కూడా శాసన సభ్యులు ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చేందుకు ఎందుకు చొరవ చూపడం లేదని పలు ప్రజాసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - సీతంపేట: పీఎం జన్‌మాన్ పథకం కింద సీతంపేట, భామిని మండలాలకు నూతనంగా మంజూరైన మూడు అంగన్వాడీ కేంద్రాలలో హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఇంటర్వ్యూలు నిర్వహించారు. సీతంపేట మండలంలోని రేగులగూడ, దిగువ బుడగరాయి అంగన్వాడీ కేంద్రాలలో రెండు హెల్పర్ పోస్టులకు ముగ్గురు అభ్యర్థులు హాజరయ్యారు. భామిని మండలంలో మాసగూడ అంగన్వాడీ కేంద్రంలోని హెల్పర్ పోస్ట్‌కు ఇద్దరు అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి ఐటీడీఏ పీవో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ, కుసిమి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివ శంకర్, సీడీపీఓలు రంగలక్ష్మి, శాంతి భవాని, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షా కేంద్రాన్ని పీఓ తనిఖీ

విశాలాంధ్ర - సీతంపేట: ఐటీడీఏ పరిధిలో గల గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు పది పరీక్షలు ప్రశాంతం

విశాలాంధ్ర - బలిజిపేట: బలిజిపేట మండలంలో పదో తరగతి పరీక్షలు రెండవ రోజు ప్రశాంత వాతావరణంలో జరిగి నట్లు మండల విద్యాశాఖ అధికారి 1 సామల సింహాచలం బుధవారం తెలిపారు. మండల కేంద్రంలో గల పరీక్ష కేంద్రాలను సందర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వంతరాం పరీక్షా కేంద్రంలో 164 మందికి 163 మంది హాజరు కాగా, ఒక విద్యార్థి గైర్హాజరయ్యారని తెలిపారు. బలిజిపేట మండలం ఎ కేంద్రంలో 149 మంది, బి కేంద్రంలో 138 మంది మొత్తం 450 మంది పరీక్షలకు హాజరైనట్లు ఆయన తెలిపారు. స్థానిక ఎస్సై వై.సింహాచలం ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసామన్నారు.

ఆశ్రమ పాఠశాలను సబ్ కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర - పాచిపెంట: మండల కేంద్రమైన పాచిపెంట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల ప్రభుత్వ గిరిజన బాలురఆశ్రమ ఉన్నత పాఠశాలను పార్వతీపురం మన్యం జిల్లా సబ్ కలెక్టర్ ఆశుతోష్ మిశ్రా ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో గల విద్యార్థులతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకుని తదుపరి విద్యా బోధనపై ఆరా తీశారు అదేవిధంగా 10వ తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు . శిథిలావస్థకు గురైన పాఠశాల భవనము ను పరిశీలించారు. అనంతరం పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు రక్తహీనత మలేరియా పై వైద్యాధికారి రవిచంద్రను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట మండల తహసీల్దార్ రవి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమణ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలి

కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో చేపట్టిన పనుల్లో అలసత్వం వద్దని, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఉపాధి హామీ పనులపై కలెక్టర్ సంబంధిత అధికారులతో బుధవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధిహామీలో నిర్మితమవుతున్న ప్రహరీ, మినీ గోకులాలు, ఇంకుడు గుంతలు, ఫార్మ్ పండ్స్, ఫిష్ పాండ్స్, రహదారులు తదితర పనుల్లో మరింత ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ఇప్పటివరకు అనుమతి పొందిన నిర్మాణాలన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సీతంపేట, సీతానగరం, జి.ఎల్.పురం, వీరఘట్టం, సాలూరు, పాలకొండ, పాచిపెంట మండలాల్లోని పనుల్లో పురోగతి కనిపించడం లేదని, నిర్లక్ష్యం వహించకుండా ఇచ్చిన లక్ష్యాలను సాధించాలని తెలిపారు. గ్రౌండింగ్ కాని పనులు వెంటనే గ్రౌండింగ్ చేసి, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని, చేపట్టిన పనులకు ఎప్పటికపుడు బిల్లులను అప్ లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకులు కె.రామచంద్రరావు, ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, ఎంపీడీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శేఖర్‌పై దాడి అమానుషం: సీపీఐ

విశాలాంధ్ర - పాలకొండ: పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం ఎల్ఎల్ పురం గ్రామంలో రియల్ ఎస్టేట్ భాగస్వామి అయిన రేజేటి శేఖర్‌పై జరిగిన ఘటనను సీపీఐ తీవ్రంగా ఖండిస్తున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు పేర్కొన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శేఖర్‌ను పరామర్శించారు. శేఖర్ తన వద్ద ఉన్న డబ్బులతో పాటు మధ్యవర్తిగా ఉండి తన బంధువుల దగ్గర, సన్నిహితుల దగ్గర పెట్టుబడిని సేకరించి రియల్ ఎస్టేట్ నిర్వాహకుడు వారాడ రాజేంద్రనాయుడుకు ఇప్పించి రియల్ ఎస్టేట్లో భాగస్వామి కూడా అయ్యాడని, రియల్ ఎస్టేట్ నిర్వాహకుడు వారాడ రాజేందర్ నాయుడు వారి బృందం కొంతమంది ఏజెంట్లను నియమించి రియల్ ఎస్టేట్ ఖాళీ స్థలాల బిట్లను అమ్మించ్చారని, అప్పులు ఇచ్చినవారికి తిరిగి చెల్లించిక పోవడంతో పాటు కాలం గడుపుతున్న కొలది రియల్ ఎస్టేట్ యజమాని రాజేందర్ నాయుడు అప్పుల వారికి కనపడకుండా ఉండడంతో వారి సొంత ఊరు వచ్చి వారి కుటుంబీకులను నిలదీఇస్తున్నారు. బయటివారు రావడానికి శేఖరే కారణం అని భావించి ఆయనపై దాడి చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బుడితి అప్పలనాయుడు, గోపి నాయుడు, గౌర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

విశాలాంధ్ర - కురుపాం: మండలంలోని మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కర్‌రావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి సరిపడే మందులు అన్ని ఉన్నాయా లేదా అని డాక్టర్ ప్రజ్ఞను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్లో డెలివరీలు ఎన్ని అవుతున్నాయో ఆరా తీశారు. అనంతరం హాస్పిటల్‌కి వచ్చిన వారితో మాట్లాడి వాళ్లకి అందుతున్న వైద్య సేవలపై సమాచారం తెలుసుకున్నారు. వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ టి.జగన్ మోహన్‌రావు, హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్‌యంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులు వైద్యారోగ్య శాఖ మార్గదర్శకాలు పాటించాలి

విశాలాంధ్ర - బెలగాం: వైద్యారోగ్య శాఖ నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలను ప్రైవేటు ఆసుపత్రులు అమలు చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచిం చారు. ఈ మేరకు జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యంతో బుధవారం స్థానిక ఎన్జీఓ హోంలో సమావేశం నిర్వహించారు. ఆసుపత్రులలో నిర్వహించిన ప్రతీ ప్రసవానికి/కాన్పుకి సంబంధించిన పూర్తి వివరాలు హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ప్రసవం తర్వాత జనన ధ్రువ పత్రాన్ని వారికి అందజేయాలన్నారు. కాన్పుల వివరాల నమోదు రికార్డు అయిన పార్చురిషన్ రిజిస్టర్ అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఒకే విధంగా ఉండేటట్లు చూసుకోవాలని తెలిపారు. ఎన్ని సాధారణ, సిజేరియన్ డెలివరీలు నిర్వహించారో ఆసుపత్రుల వారీగా రికార్డుల్లో పరిశీలించారు. సిజేరియన్ డెలివరీ నిర్వహణకు తగు కారణాలు ఉండాలని, అలాగే శస్త్ర చికిత్స సమయంలో అనస్థీషియా వైద్యులు అందుబాటులో తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్మోహనరావు, డాక్టర్ పి.ఎల్ రఘుకుమార్, ఐఎంఎ ప్రెసిడెంట్ యాళ్ళ వివేక్, డిఎస్ఓ శంకర్, డెమోలు యోగీశ్వరరెడ్డి, సన్యాసిరావు పాల్గొన్నారు.

PARVATHIPURAM MUNICIPALITY
e-PROCUREMENT TENDER NOTICE

S.No.	NIT No.	No.of Works	Total Estimate Amount
1	Tender No.3/2024-25 15th Grant, UPHC and General Fund)	6 Works	Rs.73.18 Lakhs
	Total	6 Works	Rs.73.18 Lakhs

For further details visit: For all details visit site www.apeprocurement.gov.in
Sd/- Ch.Venkateswarlu,
Commissioner, Parvathipuram Municipality

లచ్చయ్యపేటలో పి-4సర్వే పరిశీలన

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట గ్రామంలో పి-4సర్వేను ఎంపీడీఓ పాండ్రంకి త్రివిక్రమరావు సందర్శించి వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో సర్వేను పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను కూడా చురుగ్గా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గని అక్రమ కట్టడాల జోరు

నోటీసులను కూడా ఖాతరు చేయని వైనం
అడ్డుకట్ట వేయడంలో రెవెన్యూ విఫలం

విశాలాంధ్ర - పాడేరు: పాడేరు పట్టణం అల్లూరి సీతారామరాజు జిల్లా కావడం ఇక్కడ భూములకు రెక్కలు రావడం అక్రమదారులకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం అక్రమణదారులకు కలిసి వచ్చింది అనుకోవడంలో సందేహమే లేదు. తూతూ మంత్రంగా అటు రెవెన్యూ ఇటు పంచా యతీ అధికారులు నోటీసులు ఇవ్వడం నోటీసు లను లెక్కచేయకుండా నిర్మాణాలు జరపడం జరుగుతుంది. అయితే కొంతమంది రెవెన్యూ శాఖ అధికారులు అక్రమదారులతో చేతులు కలిపి నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. పాడేరు పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా బినామీ పేర్లతో అక్రమ కట్టడాలు జోరు రోజురోజుకు కొనసాగుతుంది. దాన్ని అడ్డుకట్ట వేయడంలో పూర్తిగా రెవిన్యూ శాఖ పంచాయతీ అధికారులు విఫలమవుతున్నారు. అయితే గిరిజనేతరులు గిరిజన ప్రాంతంలో శాశ్వత గృహాలు, షాపులు, రెస్టారెంట్లు నిర్మాణం చేపట్టకూడదని, 1/70 భూ బదులయింపు చట్టం ఉన్నప్పటికీ దాన్ని ధిక్కరించి అక్రమ కట్టడాలు చేపడుతున్నారు. దీనిపై సబ్ కలెక్టర్ జిల్లా కలెక్టర్ దృష్టిసారించకపోవడమే ప్రధాన కారణమని ఆరోపణలు కూడా లేకపోలేదు. అధికారులు నోటీసులు ఇలా ఇచ్చి అలా వచ్చిన వెంటనే నిర్మాణాలు చేపడుతున్నారు. దాన్ని నిలుపుదల చేయకపోవడం చాలా విడ్డూరంగా ఉంది. ఏది ఏమైనా రాబోయే రోజుల్లో గిరిజన ప్రాంతమంతా గిరిజనేతరుల చేతుల్లో కీలుబొమ్మగా ఉండడం ఖాయం అని ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా గిరిజన ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న ప్రజా సంఘాలు మేధావి వర్గాలు దీనిపై దృష్టిసారించి భారీ ఎత్తున ఉద్యమాలు నిర్వహించుకొని గిరిజన ప్రాంతాన్ని కాపాడుకోవాలని పలువురు కోరుతు న్నారు. మొన్నటికి మొన్న శాసనసభాపతి చింత కాయల అయ్యన్నపాత్రుడు 1/70 భూ బదలాయింపు చట్టం సవరణ చేస్తేనే గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పిన మాటలు మరవక ముందే రంపచోడవరం ఎమ్మెల్యే మిరి యాల శిరీష శాసనసభలో గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వాలని చెప్పిన సంఘటనలు లేకపోలేదు. గిరిజన మేధావులు గిరిజన ప్రజానీకం ఇప్పటికైనా మేలుకోకపోతే గిరిజన ప్రాంతం కనుమరుగైపోయే పరిస్థితి లేకపోలేదని పలువురు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు.

కాఫీ ఫార్చుమెంట్ ద్వారా అత్యధిక లబ్ది

కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

విశాలాంధ్ర - పాడేరు: మహిళా కాఫీ రైతులందరూ కాఫీ పండ్లను పల్పింగ్ చేసి పార్చుమెంట్ ద్వారా అత్యధిక లబ్ది పొందాలని, వారంతా లక్ పతి దీదీలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. బుధవారం స్థానిక మినుములూరులో కాఫీ రైతులతో డి ఆర్ డి ఎ, కాఫీ బోర్డ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు అవసరమైన శిక్షణలను డిఆర్ డిఎ అందించాలని, కాఫీ గింజలు ఆరబెట్టడం, పార్చుమెంట్ తదితర అంశాలపై కాఫీ బోర్డ్ వారు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా మట్టి నేలపై, పేడతో అలికిన నేలపై గింజలను ఆరబెట్టడం ద్వారా కాఫీ నాణ్యత తగ్గడమే కాకుండా ధర కూడా తక్కువకు వస్తుందని, డ్రైయింగ్ యార్డ్ లో ఆరబెట్టడం వల్ల నాణ్యత బాగుండడమే కాకుండా అధిక రేటు వస్తుందని కలెక్టర్ వివరించారు. అంతే కాకుండా పల్పింగ్ యూనిట్లు వినియోగించి పార్చుమెంట్ చేయడం ద్వారా మరింత లబ్ది చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా పాడేరు డివిజన్ కొయ్యూరు మినహా మిగిలిన పది మండలాలకు చెందినా 425 మంది మహిళా కాఫీ రైతులకు డ్రైయింగ్ యూనిట్, పల్పర్, 30 అడుగుల నిచ్చెన, టార్పాలిన్ కొనుగోలుకు రూ. 4,99,37,500లు యూనియన్ బ్యాంక్ ద్వారా మంజూరు చేసిన రుణం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ డా. ఎంజే అభిషేక్ గౌడ, కాఫీ బోర్డ్ డైరెక్టర్ డిడి మురళీకృష్ణ, ఎడి రమేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సేంద్రీయ ఉత్పత్తులతోనే సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - చింతపల్లి: సేంద్రీయ ఉత్పత్తులతోనే సంపూర్ణ ఆరోగ్యం సంప్రాప్తిస్తుందని ఎంపీపీ కోరాబు అనూష దేవి, సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. సేంద్రీయ ఎరువులతో పండించిన కూరగాయల స్టాల్‌ను మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో శ్రీనివాసరావుతో కలిసి బుధవారం వారు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనం తినే ఆహారమే విషతుల్యం కావడం దురదృష్టకరమని, అందుకే సేంద్రీయ పద్ధతుల్లో పండించే పంటలకు డిమాండ్ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మధుసూదన్, గృహ నిర్మాణ శాఖ అధికారి రమణ, వైసీపీ మండల కన్వీనర్ పాంగి గణ బాబు, సీనియర్ నాయకుడు బెన్ని బాబు, స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, మండల పరిషత్ ఉద్యోగులు, సిబ్బంది వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ్ (యాప్)లో పరిశ్రమల రిజిష్ట్రేషన్‌కు ఆహ్వానం

విశాలాంధ్ర - అరకులోయ: ఉద్యమ్ (యాప్)లో పరిశ్రమల రిజిష్ట్రేషన్‌లకు ఆహ్వానిస్తునట్లు జిల్లా పరిశ్రమల అధికారి రవిశంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో పరిశ్రమల సర్వేను గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల నమోదు చేయడం జరిగిందని తెలిపారు. సర్వేలో నమోదు చేయని యూనిట్లకు ప్రత్యేక వర్క్‌షాప్ ద్వారా ఉద్యమ్ యాప్‌లో రిజిష్ట్రేషన్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. వారి యొక్క ఫోన్ నెం., పాన్, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతా కాపీతో ఈనెల 20వ తేదీ లోపు అరకులోయ ఎంపీడీఓ కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. ఈ రిజిష్ట్రేషన్ వలన పరిశ్రమలకు బ్యాంకు రుణాలు, రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ రాయితీలు పొందవచ్చని తెలిపారు.

చాప కింద నీరులా మాస్ కాపీయింగ్

విశాలాంధ్ర - అనంతగిరి: పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు మండలంలో కానరావడం లేదు. మండలంలో నాలుగు పదవ తరగతి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా కొత్తవలస బాలుర శివలింగపురం పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. బాలికల పాఠశాలలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అవి ఎప్పుడో బిగించినవి కావడం వల్ల సక్రమంగా పని చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక మిగిలింది కేజీబీవీ పాఠశాలలో సీసీ కెమెరాలు ఊసే లేదు. సిసి కెమెరాలు ఉన్నప్పటికీ కంచె చేను మేసే చందంగా ఇన్విజిలేటర్లు డిక్టేషన్ రూపంలో మాస్ కాపియింగ్ జరుగుతున్నట్లు తెలుస్తుంది. దీనికి ముఖ్య కారణం నాలుగు సెంటర్లలో మండలంలో పనిచేసిన ఉపాధ్యాయులే ఇన్విజిలేటర్లు, డిపార్ట్మెంట్ చీఫ్‌లు, చీఫ్ లు, సిట్టింగ్ స్క్వాడ్‌లు ఉండడం వల్ల మండలం విద్యా వ్యవస్థలో వెనుకబడి పోతుందని విమర్శలున్నాయి. అధికారులు మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్టమైన ప్రణాళికలు వేసినప్పటికీ స్థానిక ఉపాధ్యాయులను, ఉద్యోగులను పరీక్ష కేంద్రాలలో విధులకు నియమించడం వల్ల యదేచ్ఛగా మాస్ కాఫీయింగ్ జరుగుతుందని తెలుస్తోంది. ఇకమీదట జరిగే పరీక్షల్లో స్థానిక ఉద్యోగులను, ఉపాధ్యాయులను పరీక్ష కేంద్రంలో విధులను తప్పిస్తే అనంతగిరి మండల విద్యా వ్యవస్థ ఏ విధంగా ఉంటుందో ఉన్నతాధికారులకు తేటతెల్లమవుతుంది.

30న శివాలయం ప్రారంభం

విశాలాంధ్ర జి.మాడుగుల: ఈ నెల 30న గాంధీనగర్ శ్రీ హనుమ ఆశ్రమం ఆలయ ప్రాంగంణంలో శివాలయ ప్రారంభోత్సవం, శివలింగం ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సాయిరాం స్వామిజీ తెలిపారు. ఉగాది పర్వదినాన నిర్వహించే ఈ మహాకార్యాన్ని భక్తులు పాల్గొని స్వామి వారు కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.

జెన్ జెడ్ షాపర్స్‌లో మూడు రెట్లు వృద్ధి నమోదు

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న ఫ్యాషన్ వినియోగాన్ని ప్రదర్శించే పరివర్తనాపరమైన వృద్ధి నమూనాలను తెలియజేస్తూ జెన్ జెడ్ కోసం భారతదేశపు మొదటి ప్రత్యేకమైన డిజిటల్ ఫ్యాషన్‌గా 2023లో ప్రారంభించబడిన ఈ వినూత్నమైన స్టోర్ ఫ్రంట్ జెన్ జెడ్ కస్టమర్లలో మూడు రెట్లు పెంపుదలకు ప్రేరకంగా నిలిచింది. టియర్ టు పట్టణాల నుండి గణనీయమైన నాలుగు రెట్లు పెరుగుదలను సూచించింది. అమేజాన్ ఫ్యాషన్ తమ నెక్స్ట్ జెన్ కోసం గొప్ప మైలురాళ్లను వెల్లడించింది. భారతదేశం అంతటా ట్రెండ్ ఫార్వర్డ్ ఫ్యాషన్ యొక్క ప్రజాస్వామీకరణను ప్రదర్శించింది. ది నెక్స్ట్ జెన్ స్టోర్ తమ వ్యూహాత్మకమైన అంతర్జాతీయ పోకడలను స్థానిక శైలులతో కలపడం ద్వారా యువత కేంద్రీయమైన ఫ్యాషన్ కోసం విజయవంతంగా అమేజాన్ ఫ్యాషన్ మార్కెట్ అంతరాన్ని తగ్గించింది.

ఉపాధి హామీ పనులు పటిష్టంగా చేపట్టాలి

విశాలాంధ్ర - హుకుంపేట: పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఉపాధి హామీ పథకం అమలులో అవకతవకలు చోటు చేసుకోకుండా అభివృద్ధిలో దూసుకుపోవాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ గౌస్ శ్రీ విద్యా సాగర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 52 కోట్ల రూపాయలతో ఉపాధి హామీ పనులు జరగక మరొక 50 కోట్ల పనులు జరగవలసి ఉందని పేర్కొన్నారు. అలాగే మండలంలో బూర్జ పంచాయితీ మొదటి స్థానం అత్యధికంగా పనులు జరిగాయని అలాగే 33 పంచాయతీలలో కూడా బూర్జ పంచాయతీని ఆదర్శంగా తీసుకుని ఉపాధి హామీ పనులు జరిగేటట్టు ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాలలో నిరుపేద రైతుకి ఆర్థిక అభివృద్ధి తోడ్పడడం కోసం ఉపాధి హామీ పనులు ఎంతగానో ఉపయోగపడుతుందని వాటిని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఉపాధి హామీ నిజనిర్ధారణ ప్రజా వేదికలో ఫీల్డ్ అసిస్టెంట్లు పై ఎటువంటి తప్పుడు ఆరోపణలు వచ్చిన సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజబాబు, విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి, అరుకు క్లస్టర్ ఏపీడి పవన్ కుమార్, ఏపీ లింగమూర్తి, సోషల్ ఆడిట్ ఎస్ఆర్ పి రాజు, టెక్నికల్ డిఆర్ పి షణ్ముఖ, తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులు వద్దు - మన్యం అభివృద్ధే ముద్దు

విశాలాంధ్ర - కొయ్యూరు: సిపిఐ మావోయిస్టు వద్దు అరాచకం అసలే వద్దు, గిరిజన ప్రాంతం అభివృద్ధి ముద్దు అంటూ గిరిజనలు గరిమండ వారపు సంతలో భారీ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. మావోయిస్టు ప్రభావంతో తమ గిరిజన ప్రాంతాలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోకుండా ఉండిపోయాయని ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్నాయని వాటిని నాశనం చేయొద్దు అంటూ నినాదాలు చేశారు. గతంలో రోడ్లు మౌలిక వసతులు వంటివి లేకపోవడంతో అనారోగ్యాలు కు గురైన వారిని గర్భిణీ స్త్రీలను హాస్పటల్ కు తరలించేందుకు అష్ట కష్టాలు పడాల్సి వచ్చేదని నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి మారుమూల ప్రాంతాలకు రహదారులను నిర్మించడంతో రోగులను ఆసుపత్రులకు తరలించేందుకు వీలు కలుగుతుందన్నారు. ఇలాంటి తరుణంలో మావోయిస్టులు తమ అభివృద్ధికి ఆటంకం కలగకుండా ఉండాలంటూ నినాదాలు చేశారు.

పది పరీక్షలు ప్రశాంతం



విశాలాంధ్ర - జీకే వీధి: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని మండల తహశీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు ఏర్పాటు చేసిన ఏ, బి పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు. పరీక్షల్లో విద్యార్థినీ, విద్యార్థుల హాజరు శాతాన్ని పరీక్షల ముఖ్య నిర్వహణ అధికారి కుప్ప పోతురాజుచే వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోమవారం జరిగిన హిందీ పరీక్షకు రెండు పరీక్ష కేంద్రాలలో ఒక విద్యార్థి హాజరు కాకపోగా 99 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని వీఆర్వో లింగాలు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలపై క్యాంపెయిన్

విశాలాంధ్ర - సీతానగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల సంఖ్యను పెంచే ఉద్దేశంతో ప్రిన్సిపాల్ దాలినాయుడు సహాయ సహకారాలతో జడ్పీహెచ్ స్కూల్ బూర్జ పరీక్ష కేంద్రం వద్ద క్యాంపెయిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పదవ తరగతి పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థినీ, విద్యార్థులను కలిసి తమ కళాశాలలో జాయిన్ కావాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫలితాలు, మౌలిక సదుపాయాల గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్స్ దాసరి రామకృష్ణ, డి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీలను నిర్మూలించండి

విశాలాంధ్ర - రంపచోడవరం: ఏజెన్సీలో బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీలు నిర్మూలించే బాధ్యత మనందరిపై ఉందని రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ వారి కార్యాలయ సమావేశపు హాల్లో ఏజెన్సీలోని అన్ని మండలాలకు సంబంధించిన తహశీల్దార్లతో, అల్లూరి సీతా రామరాజు జిల్లా జిసిడిఓతో, మండల విద్యాశాఖ అధికారులతో, ఐసిడిఎస్ సూపర్వైజర్లతో, ఎన్జీవోలతో, పోలీస్ అధికారులతో బాల్య వివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీలు నిర్మూలించే విధంగా రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్పశ్రీ మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రతి గ్రామంలో టీనేజీ ప్రెగ్నెన్సీలు, బాల్య వివాహాలు నిర్మూలించే విధంగా గ్రామపంచాయతీ సచివాలయాల పరిధిలో అందరికీ అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. ఏజెన్సీలోని సెలవుల్లో బాలికలు ఇండ్లకు వెళ్ళినప్పుడు టీనేజ్ ప్రెగ్నెన్సీ, బాల్యవివాహాలు నిర్మూలన కొరకు బాలికల తల్లిదండ్రులకు, ఆయా గ్రామాలకు చెందిన బాలికలకు అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీలోని అన్ని మండలాలకు సంబంధించిన తహశీల్దార్లు సిహెచ్ శ్రీనివాసరావు, వేణుగోపాల్, కె.సూర్యనారాయణ, కరక సత్యనారాయణ, పి.రామకృష్ణ బాలాజీ, ఏఎస్.సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ ఎన్వి సత్యనారాయణ, ఎంపీడీవోలు యస్.శ్రీనివాసరావు, కెఆర్.విజయ, మడకం బాపన్న దొర, యాదగిరి ఈశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారులు రామకృష్ణ, బాపన్న దొర, తాత అబ్బాయి దొర, ముత్యాలరావు, వై.వెంకన్న, పి.శ్రీనివాసరావు, టి.సూరారెడ్డి, పోలీస్ అధికారులు, అంగన్వాడి సూపర్వైజర్లు, ఎన్జీవోస్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో పీసా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: ఏజెన్సీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీసా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలంటూ మండల పీసా సంఘ మండల అధ్యక్షులు తాము సూరిబాబు, ఆదివాసి సంఘాలు డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక రాజవొమ్మంగి తహసీల్దార్ అల్లు సత్యనారాయణకు వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలోని ఏజెన్సీ గ్రామాలలో గిరిజనేతరులు గిరిజన చట్టాలకు విరుద్ధంగా భూమి అక్రమాలకు పాల్పడుతున్నారని అటువంటి వారిపై రెవెన్యూ అధికారులు చట్టపరమైన

చర్యలు చేపట్టి వారికి నోటీసులు జారీ చేసి గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసా సంఘ మండల అధ్యక్షులు తాము సూరిబాబు, ఆదివాసి సంఘ నేతలు లోత రాజబాబు, పిసా సంఘం జనరల్ సెక్రటరీ తెల్ల రాంబాబు, భీమరాజు, నాని, లక్ష్మణ్ రెడ్డి, వెంకటరావు, వీరబాబులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

విశాలాంధ్ర - సీతంపేట: ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు, సిబ్బంది అగ్నిమాపక అవగాహన సదస్సు ఏర్పాటు చేసి విద్యార్థులకు డ్రై కెమికల్ పౌడర్, ఫైర్ ఎక్టింగ్ విషర్ ఉపయోగించే పాస్ పద్ధతి వివరించారు. అగ్ని ప్రమాద రకములు వాటిని నివారించే పద్ధతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి. చంద్రరావు, సి. హెచ్ నల్లయ్య, కామేశ్వరరావు, కె.ప్రసాద్‌రావు, ఎస్.మంగయ్య, ఎన్.వెంకట్రావు, ఎం.సూరిబాబు, బి.కాశయ్య, ఏ.గోవిందరావు, ఎస్.బెన్నడు, వ్యాయామ ఉపాధ్యాయులు వి.భాస్కరరావు, జె.జగదీష్ పాల్గొన్నారు.

పదిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కొమ్మినేని కిషోర్ కుమార్ పేరిట నగదు పురస్కారాలు

విశాలాంధ్ర - సీతానగరం: సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024-2025 విద్యా సంవత్సరం నుండి పదో తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు పొంది ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు 5 వేలు, 3 వేలు, 2 వేలు నగదును కీర్తిశేషులు కొమ్మినేని కిషోర్ కుమార్ జ్ఞాపకార్థం ఇవ్వడం జరుగుతుందని కిషోర్ కుమార్ తల్లి కొమ్మినేని లక్ష్మినాగేశ్వరి, కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రతీసంవత్సరం జూన్ 26న కిషోర్ కుమార్ పుట్టినరోజునాడు ఈ నగదు బహుమతులను సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో అందజేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఇదిలా ఉండగా తమ పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు కొమ్మినేని కిషోర్ కుమార్ జ్ఞాపకార్థం 10 వేల రూపాయల నగదు బహుమతులను ఆమె తల్లి కొమ్మినేని లక్ష్మీ నాగేశ్వరి ప్రకటించడం పట్ల స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

పాడేరు మండల పీసా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర - పాడేరు: పాడేరు మండలం పీసా కమిటీ నూతన కార్యవర్గం మండల ఎన్నిక బుధవారం పాడేరు మోదకొండమ్మ ఆడిటోరియంలో మాజీ ఫోరం అధ్యక్షులు సల్ల రామకృష్ణ, పాలికి లక్కు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యవర్గ ఎన్నికలు గౌరవ అధ్యక్షులుగా సల్ల రామక్రిష్ణ, గౌరవ సెక్రటరీగా లకే అబ్బాయి దొర లను ఎన్నుకోగా అధ్యక్షులు వంజంగి రమేష్ నాయుడు, కార్యదర్శిగా బోనంగి రమణలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిసిసి రాష్ట్ర సభ్యులు బోర్రా నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసా చట్టం అమలుకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని మనకున్న హక్కులు చట్టాలు కాపాడాలని గిరిజన ప్రాంతం అన్యక్రాంతం అవ్వకుండా కాపాడాలన్నారు. ఈ కార్యక్రమలో ఉపాధ్యక్షులు రోబ్బ కృష్ణరావు, బర్సింగి శ్రీనివాసరావు, కొర్ర బాలరాజు, పాలవేలి, సహాయ కార్యదర్శి యూవరాజు, గబ్బడ త్రినాథ్, బి. సింహాచలం, కుడా వెంకటేష్, పాలికి లక్కు, కూడ సింహాచలం, కోశాధికారి కొట్టగుల్లి సింహాచలం నాయుడు, కొండపల్లి కాంతారావు, గెమ్మెల్లి వాసుదేవరావు, లింగేరి సుందరావు, అయ్యప్ప పాత్రుడు, మోహనరావు, పి.మాణిక్యం, కిముడు నాగరాజు, డి.విజయకుమారి, ఎస్.చిట్టిబాబు, దల్లపల్లి బొంజుబాబు, సామ్యూల్ సి హెచ్ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

బోర్లు వేసి..కనెక్షన్ మరిచారు

సీపీఎం మండల కార్యదర్శి ధనుంజయ్

విశాలాంధ్ర - చింతపల్లి: జల్ జీవన్ మిషన్‌లో బోర్లు వేసి ఇంటింటి కనెక్షన్లు ఇవ్వడం మరిచారని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్ అన్నారు. సిపిఎం పార్టీ ప్రజా చైతన్య యాత్రలో భాగంగా చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ సచివాలయం -2లో బుధవారం ఆ పార్టీ మండల కమిటీ సభ్యుడు సాగిన చిరంజీవి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి సచివాలయం సిబ్బందికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ధనుంజయ్ మాట్లాడుతూ మండలంలోని చౌడుపల్లి పంచాయతీ సచివాలయ పరిధి గ్రామాల్లోని అనేక సమస్యలపై ఆయా గ్రామాల ప్రజలు తమకు విన్నవించారన్నారు. జల్ జీవన్ మిషన్లో మండలం మొత్తం చాలా అవకతవకలు జరిగాయని, ఈ పథకం ప్రజలకు ఉపయోగం లేదని, గుత్తేదారులు సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. పిన్న కొత్తూరు గ్రామంలో జల జీవన్ మిసన్ ద్వారా మంచినీరు సదుపాయం కల్పిస్తామని నేటికి పనులు పూర్తి చేయకుండా బోరు వేసి ఇంటింటికి పైపులు వేసి విద్యుత్ మోటర్ కనెక్షన్ ఇస్తామని ట్యాంక్ కట్టకుండా మధ్యలో నిలిపివేశారని ఆరోపించారు. అక్కడే కాకుండా అనేక గ్రామాలలో ఇదే తీరు ఉందని మండిపడ్డారు. అందువలన గ్రామస్తులు త్రాగునీరు లేక అవస్థలు పడుతున్నారన్నారు. ఆ గ్రామంలో సిమెంటు రహదారులు, సామాజిక భవనాలు లేవు. నూతనంగా నిర్మించిన అంగన్వాడి భవనం కూడా పూర్తి చేయకుండా మధ్యలో ఆపేసారని, ఆయా గ్రామాల్లో పోడు భూములకు పట్టాలు ఇవ్వలేదని, ఆ గ్రామంలో పీవీటిజి తెగకు చెందిన వారికి ఇస్తున్న ప్రత్యేక గృహాలకు సంబంధించి కొంతమందికి మాత్రమే ఇచ్చారని, ఇంకా అర్హులైన వారు చాలామంది ఉన్నారని, అందరికీ పిఎంజేవై గృహాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాంగి రాజు, జి.మల్లేష్, లక్ష్మయ్య, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనపై అవగాహన

విశాలాంధ్ర - సీతంపేట: మండలంలో నవోదయం 2 ప్రోగ్రాంలో భాగంగా రిజన ప్రాంతాలలో నాటుసారా తయారీని నిలుపుదల చేయాలని, ప్రజల ఆరోగ్యాలను కాపాడుకోవాలని బుధవారం మండ గ్రామంలో నవోదయం ప్రోగ్రాం ప్రత్యేక అధికారి ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జై భీమ్ తెలిపారు. సారా తాగితే అదోగతి మానితే పురోగతిని తెలిపారు. గ్రామాల అభివృద్ధి జరగాలంటే నాటు సారా నిర్మూలన జరగాలని తెలిపారు. సారాయి సేవించడం మానివేసి ఆరోగ్యాలను కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గీతాంజలి, లోకల్ సబ్ ఇన్స్పెక్టర్ అమ్మనరావు, ఎంపీటీసీ చంటి, సర్పంచులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సీవై.టీబీ పరీక్ష చేయించుకోవాలి

వైద్యాధికారులు డాక్టర్ అచ్యుత్, డాక్టర్ పృధ్విషా

విశాలాంధ్ర - చింతపల్లి: రెండు వారాలకు మించి ఎడతెరిపిలేని దగ్గు, ఇతర లక్షణాలతో ఎవరైనా బాధపడుతుంటే, అటువంటి వారు విధిగా సివై టీబీ స్కిన్ టెస్ట్ (ట్యూబర్ క్యులోసిస్ యాంటిజెన్ ఆధారిత చర్మ పరీక్ష) చేయించుకోవాలని వైద్యాధికారులు డాక్టర్ అచ్యుత్, డాక్టర్ పృధ్విషా అన్నారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ 18 ఏళ్ల వయసు దాటిన ప్రతి ఒక్కరూ ఈ పరీక్ష చేయించు కోవచ్చునని వారు తెలిపారు. అదే విధంగా ప్రస్తుతం స్కిన్ పరీక్ష కూడా పూర్తిగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులోకి వచ్చాయన్నారు. సి వై స్కిన్ టెస్ట్ అనేది టీబీ వ్యాధికి సంబంధించిన లక్షణాలు ఉన్నవారు, టీబీ రోగులకు సంబంధిన కుటుంబ సభ్యులు గాని వారికి సేవ చేసే వ్యక్తులు గాని, టుబాకో ఉత్పత్తులు తీసుకునేవారు గాని, అదే విధంగా మెడ మీద కాయలున్న వారు గాని విధిగా ఈ పరీక్ష చేయించుకోవలసిన అవసరం ఉందన్నారు. చింతపల్లి ఏజెన్సీ లోని పెద వలస, ఆర్వి నగర్, జర్రెల, గూడెం కొత్త వీధి, సప్పర్ల, దారకొండ, సీలేరు తదితర అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఈ స్కిన్ టెస్ట్ పరీక్షలకు సంబంధించిన పరికరాలను, ఇంజెక్షన్‌లను అందించడం జరిగిందని జీకే వీధి ఎస్‌టిఎస్‌జి అశోక్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిఎల్ఎస్. ఏవి రావు, ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు అంగన్వాడీనే తొలి బడి కావాలి

విశాలాంధ్ర - రంపచోడవరం: ఏజెన్సీలోని ప్రతి అంగన్వాడి కేంద్రం ద్వారా బాల బాలికలకు ఆటపాటలతో చదువు నేర్పించే తొలి బడి కావాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్ట సింహాచలం పేర్కొన్నారు. బుధవారం రంపచోడవరం మండలం రంప గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని ప్రాజెక్ట్ అధికారి ఆకస్మికంగా పర్యటించి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాల్లో అంగన్వాడి కేంద్రాలలో బాల బాలికలకు ఆటపాటలతో చదువు నేర్పించాలని ఆయన అన్నారు. ఈ అంగన్వాడి కేంద్రంలో ఎంతమంది బాలబాలికలు ఉన్నది అదేవిధంగా ప్రతిరోజు ఏఏ ఆహారం పెట్టుచున్నది ఆయన ఆరా తీశారు. ఈ అంగన్వాడి కేంద్రం పరిధిలో ఎంతమంది గర్భిణీలు ఉన్నది అదేవిధంగా ఎంతమంది బాలింతలు ఉన్నది ఆయన ఆరా తీశారు.

ఏయస్‌డిఎస్ ఫౌండేషన్ వితరణ

విశాలాంధ్ర - కూనవరం: కూళ్లపాడు గ్రామంలో ఏయస్‌డిఎస్ ఫౌండేషన్ ద్వారా 137 గిరిజన కుటుంబాలకు వెయ్యి రూపాయలు విలువ చేసే నిత్యావసర సరుకుల కిట్లను గడేసుల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కూళ్లపాడు గ్రామంలోని ప్రజలు మా ఊరు శుభ్రత అనే కార్యక్రమం ద్వారా వారి గ్రామంలో డ్రైనేజీలు, కాలువలు స్వచ్ఛందంగా శ్రమదానం చెయ్యడం జరిగింది. ఫౌండర్ ఉండవల్లి గాంధీకి గ్రామస్తులు రంజిత్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్, ఏయస్‌డిఎస్ కో ఆర్డినేటర్ నిరుపతి రవి, తెలుగు యువత నాయకులు గీగా రామారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

22న మండల పరిషత్ సమావేశం

విశాలాంధ్ర - సీతానగరం: ఈనెల 22న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బలగ రవణమ్మ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో పాండ్రంకి త్రివిక్రమరావు తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలతో, సర్పంచులు తదితరులు హాజరుకావాలని ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులంతా పూర్తిస్థాయి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

20 నుంచి అంగన్వాడీలకు శిక్షణ

విశాలాంధ్ర - అడ్డతీగల: ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించబడుతుందని ఐసిడిఎస్ సిడిపిఓ సిహెచ్ లక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు మండలంలోని అందరు అంగన్వాడీ కార్యకర్తలకు ఎల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు "పోషణ్ - పదాయి" శిక్షణను జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్ ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు.

మన్యం జిల్లా పది పరీక్షలపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర - పార్వతీపురం: పార్వతీపురం మన్యంజిల్లాలో జరుగుతున్న పదవతరగతి పరీక్షలపై రాష్ట్రప్రభుత్వ విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సాధించినట్లు స్పష్టంగా తెలుస్తుంది. ఇప్పటికే జరిగిన తెలుగు/ సంస్కృతం,హిందీ పరీక్షలకు పెద్దఎత్తున స్క్వాడ్ బంధాలు పరీక్షకేంద్రాలను సందర్శిస్తున్నాయి. వరుసగా రెండుసార్లు పదోతరగతి పరీక్షల్లో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఈఏడాది కూడా ఇదేస్థాయిలో ఫలితాలు సాధిస్తే హ్యాట్రిక్ సాధించిన ట్లవుతుంది. ఈదశలో విద్యాశాఖ ఉన్నతాధికారులు పార్వతీపురం మన్యం జిల్లా పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారిం చడంతోపాటు రాష్ట్రస్థాయి పరిశీలకులుకూడా పరీక్ష కేంద్రాలను సందర్శిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. చాలాకేంద్రాల్లో పరీక్షలు రాస్తున్న పిల్లలు స్క్వాడ్ల రాకతో పరీక్షల రాయడంలో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఏదేమైనా గత రెండు రోజులుగా జరిగిన పరీక్షలు చాలా స్ట్రిట్టుగా జరిగాయని ఉపాధ్యాయులు, పరీక్షలు రాస్తున్న విద్యార్థులు,వారి తల్లిదండ్రులు తెలియజేస్తున్నారు. ఇలా జరిగితే పార్వతీపురం మన్యం జిల్లా పదో తరగతి ఫలితాల్లో వెనుకబడి అవకాశం స్పష్టంగాఉందని తెలుస్తుంది. పరీక్షా కేంద్రాల్లోకూడా గతంలో జరిగినట్లు పరీక్షలు జరగడంలేదని పిల్లలు వాపోతున్నారు. సీసీ కెమెరాల నిఘాలో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షలతో పోలిస్తే పదోతరగతి పరీక్షలు మాత్రం విభిన్నంగా జరుగుతున్నాయి.జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ అమలు చేస్తున్న మై ఫ్రెడ్- మై స్కూల్ కార్యక్రమం కూడా గతఏడాది తరహాలో ప్రత్యేక అధికారులు సందర్శించిన దాఖలాలు చాలా తక్కువనే చెప్పవచ్చు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్లు, కొంత మంది జిల్లాఅధికారులు తప్ప చాలామంది అధికారులు ఆశించినస్థాయిలో పాఠశాలలకు వెళ్లి సూచనలు సలహాలు ఇవ్వలేదని చాలామంది ఉపాధ్యాయులు మాటల్లో తెలిసింది.దానికితోడు ఈఏడాది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగడంతో ఎన్నికలలో చాలామంది ఉపాధ్యాయులు ఎన్నికల్లో వారి వారి నాయకుల గెలుపు కోసం అహర్నిశలు పనిచేసిన సంగతి తెలిసిందే. దీని ప్రభావం కూడా ఈఏడాది ఫలితాలపై స్పష్టంగా పడనున్నది. ఏదేమైనా ఏమేరకుఫలితాలు వస్తాయన్నది రేపటినుండి జరుగనున్న మిగిలిన గ్రూప్ పరీక్షల నిర్వహణతో తెలుస్తుంది మరి.

అంటిపేటలో పొలంపిలుస్తోంది

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని అంటిపేట గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంను బుధవారం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి అవినాశ్ మాట్లాడుతూ రైతులతో వేసవి పంటల వివరాల గురించి చర్చించారు. నవధాన్యాలు,

తృణధాన్యాలు సాగును పెంపొందించాలని రైతులకు సూచించారు. దీనివలన నేలసారం పెరగడంతో పాటు రైతుకు లాభం చేకూరుతుందని సూచించారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ ద్వారా యంత్ర సేవలో ట్రాక్టర్ తాలూకా పరికరములు, దమ్ము సెట్, దుక్కి సెట్, రోటవేటర్స్, పవర్ టిల్లర్స్, పవర్ వీడర్స్, వరి నూర్పిడి పరికరం, స్ప్రేయర్లు వంటి పరికములు రాయితీపై రైతులకు అందించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి తొమ్మిది నెలల పాలన భేష్

విశాలాంధ్ర - చింతపల్లి: కేంద్ర రాష్ట్రాలలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది మాసాలు కావస్తున్నా ప్రభుత్వ అధికారుల తీరులో మార్పు రాలేదని తెదేపా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిలో పూర్ణచంద్రరావు, ఆంద్రాబు లక్ష్మణ్ అన్నారు. పార్టీ మండల సమావేశం బుధవారం చింతపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా మన్యంలో నెలకొన్న పలు సమస్యలపై నాయకులు కార్యకర్తలు చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నా మండలంలో ఉన్న ప్రభుత్వ అధికారుల తీరులో మార్పు రాలేదన్నారు. మండలంలో నెలకొని ఉన్న సమస్యలన్నీ లిఖిత పూర్వంగా వ్రాసి

తెదేపా పాడేరు నియోజకవర్గం ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి దృష్టిలో పెట్టేందుకు తీర్మానించడం జరిగిందన్నారు. మండల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు, సంతకాలు కూడా సేకరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు పెదిరెడ్ల బేతాళుడు, జి మంగు, బి గంగరాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు ఆనంద్, మైనార్టీ సెల్ నాయకుడు షేక్ కాసిం వల్లి, చెన్నకేశవ, గోసరెడ్డి సోమేశ్, అబ్బాయి నాయుడు, మహేష్, మధు, నాయుడు, అప్పలకొండ, చిన్నాబాయ్, పరమేశ్వరావు, నారాయణ రావు, అర్జున్, మహేంద్ర, నాగు, అనిల్, సుదర్శన్, కేసుబాబు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

విశాలాంధ్ర - గంగవరం: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు సంబంధించిన మందులు రోగులకు అందజేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదేశించారు. బుధవారం గంగవరం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రాజెక్ట్ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి అదేవిధంగా రక్త నమూనాలు స్వీకరించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని ఆయన అన్నారు. అనంతరం రోగులకు రక్త పరీక్షలు ఏ విధంగా చేయుచున్నది ల్యాబ్‌ను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ప్రాజెక్ట్ అధికారి వారి వెంట డిప్యూటీ తాసిల్దార్ స్వామి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ టీ.లక్ష్మణ్, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో దృష్టిలోపం విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ

విశాలాంధ్ర - బెలగాం: పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 62,498 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించి దృష్టి దోషం వున్న 1,841 మంది విద్యార్థులను గుర్తించి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నేత్ర వైద్యాధికారి జె.నగేష్ రెడ్డి పర్యవేక్షణలో జిల్లాలో కళ్లజోళ్లు పంపిణీ పూర్తి చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, జిల్లా అందత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డా. ఎస్. భాస్కరరావు తెలిపారు. ఈ కళ్లజోళ్లతో కంటి చూపు కాపాడుకొని విద్యార్థులందరూ చదువుపై శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్లు శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, వేణు గోపాలరావు, క్రిష్ణారావు, ప్రసాదరావు నేత్ర వైద్య సహాయకులు రమేష్, సన్యాసమ్మ, స్వాతి పాల్గొన్నారు.

పది పరీక్షా కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు

విశాలాంధ్ర - కురుపాం: పదవతరగతి పరీక్షా కేంద్రాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్ఐ పి.నారాయణరావు తెలిపారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎపి మోడల్ స్కూల్ పదవ తరగతి పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పోలీసు సిబ్బంది, పరీక్షా కేంద్రాలు నిర్వహకులతో మాట్లాడుతూ సూచనలు చేశారు. పరిక్షా కేంద్రాలు పరిసరాల్లోకి ఇతరులను అనుమతించ రాదని ఆదేశించారు.

స్వయం ఉపాధి కోసం నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు జిల్లా కలెక్టర్ సూచనలు అనుసరించి పార్వతీపురం పురపాలక సంఘం నందు ఉన్నటువంటి బిసి కులాలుకు చెందిన పేద నిరుపేద కుటుంబాలకు చెందిన వారు స్వయం ఉపాధి కొరకు బిసి కార్పోరేషన్ ద్వారా రుణాలు పొందుటకు మీ దగ్గరలో వున్న సచివాలయం నందు గాని, మీ సేవ నందు గాని నెట్ సెంటర్ నందు గాని మీ వివరములును ఏపీఓబి ఎంఎంఎస్ పోర్టల్ నందు నమోదు చేసుకున్న వారికి ప్రభుత్వం నుండి ప్రోత్సాహకాలు, బ్యాంకు రుణాలు వారి వ్యాపార అభివృద్ధికి లభిస్తాయని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. జనరిక్ మెడికల్ స్టోర్ నిర్వహించదలచిన వారు బి ఫార్మసీ, డిఫార్మసీ లో గాని ఉత్తీర్ణలై వయస్సు 21 నుంచి 60 సంలు మధ్య ఉండాలని,ఉచిత టైలరింగు శిక్షణ కొరకు 21 నుంచి 50సంలు మధ్య గల మహిళలు అర్హులని శిక్షణ కాలము పిదప బేసిక్ టైలరింగు మిషన్ ఉచితంగా ఇవ్వబడునని కుమ్మరి,మేదర కులాలుకు చెందిన వారు వారి యొక్క కుల వృత్తిని నిర్వహించుకునుటకు ప్రత్యేక అవకాశము కల్పించియున్నారన్నారు. కావున ఆసక్తి కలవారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కల్పించినటువంటి అవకాశాన్ని వినియోగపరుచుకుని ఈనెల 22 లోగా వారి పేరును నమోదు చేసుకోవాలన్నారు.

జిల్లాలో పది పరీక్షలకు 48మంది గైర్హాజరు

విశాలాంధ్ర - పార్వతీపురం/ సీతానగరం: జిల్లాలో బుధవారం జరిగిన పదవ తరగతి హిందీ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖాధికారి నల్ల తిరుపతినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 67 పరీక్షాకేంద్రాల్లో జరుగుతున్న పరీక్షలలో పదివేల 367మందికి గాను పదివేల 319 మంది హాజరుకాగా, 48 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. సీతానగరం మండలంలో బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంతో పాటు జోగంపేటలోని ప్రతిభ కళాశాల పరీక్షా కేంద్రాన్ని ,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల పరీక్షా కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి బుధవారం నాడు ఆకస్మిక సందర్శించారు. ఈ మూడు కేంద్రాల్లో ఒక్కరు మాత్రమే గైర్హాజరు అయ్యారని మండల విద్యాశాఖ అధికారి సూరిదేముడు తెలిపారు.

పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసిన పాజెక్ట్ అధికారి

విశాలాంధ్ర - గంగవరం: గంగవరం లో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాల ఆశ్రమ బాలురు ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాలను బుధవారం రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కే సింహాచలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు పొందుతున్న సదుపాయాల గురించి ఆరా తీశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని మాస్ కాపీయింగ్ కు ఎటువంటి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

డైలీ నగర్ గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దుతా

దత్తత గ్రామంలో సమస్యలు పరిష్కరిస్తా సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వినీత

విశాలాంధ్ర - చింతపల్లి : సీఆర్పీఎఫ్ దత్తత తీసుకున్న డైలీ నగర్ గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దుతానని సీ ఆర్ పీ ఎఫ్ 234 పటాలానికి(బెటాలియన్) చెందిన అసిస్టెంట్ కమాండెంట్ డి. వినీత అన్నారు. డైలీ నగర్ గ్రామాన్ని దత్తత తీసుకున్న ఆమె ఆ గ్రామంలో సదుపాయాల కల్పన పై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఆ బెటాలియన్ (సీ ఆర్ పీ ఎఫ్ 234) కు చెందిన కమాండెంట్ మనోజ్ కుమార్ విశాఖపట్నం వారి ఆదేశాల మేరకు ఆ గ్రామంలోని ప్రజలతో ఆమె మమేకమయ్యారు. ఈ క్రమంలో స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవి, సర్పంచ్ దురియా పుష్పలత లతో కలిసి గ్రామస్తులతో సమావేశమై గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరాతీశారు. గ్రామ పెద్ద కొర్ర మల్లుబాబు పలు సమస్యలు ఆమె దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించమని కోరారు. సర్పంచ్ దురియా పుష్పలత మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ పరంగా సిమెంటు రహదారులు కల్పించడం జరిగిందన్నారు. అదే క్రమంలో త్రాగునీటి కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. గృహాల నిర్మాణానికి అవసరమైన ఎల్ పీ సీ ల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఎంపీపీ కోరాబు అనూష దేవి మాట్లాడుతూ గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి పరచాలని సీ ఆర్ పీ ఎఫ్ పోలీస్ ఆలోచన చేయడం అభినందనీయం అన్నారు. ఈ ఆలోచన వలన డైలీ నగర్ గ్రామం ఆదర్శ వంతమైన గ్రామంగా, అక్కడి ప్రజలు సత్ప్రవర్తన గల వారిగా తయారయ్యేందుకు దోహద పడుతుందన్నారు. ఈ సందర్భంగా లవ్ అండ్ కేర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు ఏసు పాదం ద్వారా వితరణగా అందజేసిన బ్లాంకెట్స్ (రగ్గులు) ను స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, హేమంత్ కుమార్ దంపతులు సీ ఆర్ పీ ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వినీత, ఎంపీపీ అనూష దేవి చేతుల మీదుగా డైలీ నగర్ గ్రామస్తులకు పంపిణీ చేశారు.

అనంతరం సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వినీత మాట్లాడుతూ తాను సీ ఆర్ పీ ఎఫ్ 234 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ గా చింతపల్లి వచ్చి రెండు నెలలు అయిందన్నారు. పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలలో తమ సిబ్బందితో కలసి రక్షణ, ప్రజల ప్రయోజనార్థమై తిరగడం జరిగిందన్నారు. గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను కమాండెంట్ మనోజ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా సిఆర్పిఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భోజన కార్యక్రమం లో గ్రామస్తులతో కలసి ఆమె సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్, వైకాపా మండల అధ్యక్షుడు మోరి రవి, చౌడుపల్లి పంచాయతీ వార్డు సభ్యుడు కోరాబు కరుణానిధి, వైకాపా సీనియర్ నాయకుడు గెమ్మెల సింహాచలం. తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, మధుబాబు, డైలీ నగర్ గ్రామ పెద్దలు మల్లు బాబు,

పోతురాజు, నీలకంఠం, త్రినాథ్, దేవుడమ్మ, సువర్ణ, కొండమ్మ, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రన్న స్వయం ఉపాధి పథకం క్రింద ఆర్థిక సాయం

విశాలాంధ్ర - జీకే వీది: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు బిసి ఈ డబ్ల్యూ ఎస్, కాపు కార్పొరేషన్ ఆధ్వర్యంలో చంద్రన్న స్వయం ఉపాధి పథకం కింద ఆర్థిక సాయం అందించుటకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీవో ఉమామహేశ్వర రవు తెలిపారు. ఏ పీ. ఓ బి ఎం ఎం ఎస్ ద్వారా అప్లికేషన్ ను మీసేవ ద్వారా, గ్రామ సచివాలయం ద్వారా గాని దరఖాస్తు చేయాలన్నారు. దీనికి సంబంధించిన టైలరింగ్ యూనిట్స్ బిసి 14 కాపు 11 ఈ డబ్ల్యూ ఎస్ 1 యూనిట్స్ కలవని, అర్హత కలవారు ఈనెల 22వ తేదీ లోపు యూనిట్స్ అప్లై చేసుకోవాలని జీకే వీధి ఎంపీడీవో కోరారు.

యువతకు వాలీ బాల్ కిట్స్ అందజేత

విశాలాంధ్ర - వై.రామవరం: మండలంలోని కోట గ్రామంలో బుధవారం కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా వై.రామవరం పోలీసులు యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు.అడ్డతీగల సీఐ నరసింహామూర్తి వాటిని అందచేశారు.అలాగే పిల్లలకు పుస్తకాలు, పెన్నులు అందించారు. గంజాయి వాడకం, అక్రమ రవాణా, నాటుసారా విక్రయాలు, సైబర్ క్రైమ్‌ల జోలికి వెళ్తే చట్టరీత్య చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. వాహన నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, ట్రైనింగ్ ఎస్ఐలు సురేష్, చక్ర దొర, సిబ్బంది పాల్గొన్నారు.

కోటలో మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

విశాలాంధ్ర - వై.రామవరం: మండలంలోని కోట గ్రామంలో బుధవారం పలువురు గ్రామస్తులు మావోయిస్టులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. సెల్ టవర్లను అడ్డుకుంటున్నారని, అభివృద్ధిని కుంటుపరుస్తున్నది మావోయిస్టులేనని ర్యాలీలో నినాదాలు చేశారు.

4 కేంద్రాల్లో పది పరీక్షలు

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలోని 4 పరిక్ష కేంద్రాంలో పది పరిక్షలు ప్రశాంతంగా జరిగింది. 4కేంద్రాల్లో మొత్తం 646మంది విధ్యార్థులు పరిక్షలు రాయాల్సి ఉండగా 643 మంది పరీక్షకు హాజరైనట్లు ఎంఈ వో ఈశ్వరరావు తెలిపారు. హుకుం పేట పరిక్ష కేంద్రాంలో పాడేరు డీఎస్ పి సహాబాజ్ అహ్మద్ సందర్శించా రు. పరిక్ష కేంద్రాంలో విధ్యార్థులకు ఎటు వంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చూడాలని కోరారు. విధ్యార్థులు ఎటువంటి కంగారు లేకుండా జాగ్రత్తగా పరిక్ష రాయాల ని విద్యార్థులకు ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న శ్రీను కుటుంబానికి ప్రగాఢ సానుభూతి

విశాలాంధ్ర - పాలకొండ: విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ వైకాపా అగ్ర నాయకులు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను అన్నయ్య) కుటుంబానికి పాలకొండ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు, ఐదవ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ వెలమల మన్మధరావు ప్రగాఢ సానుభూతిని బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మన్మధరావు మాట్లాడుతూ చిన్న శ్రీను అన్నయ్య కుమారుడు ప్రణీత్ బాబు మరణం కలిచివేసిందని వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ఇవ్వాలని తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

20 నుండి అంగన్వాడీలకు శిక్షణ

విశాలాంధ్ర - హుకుంపేట: ఈ నెల20వ తేదీ నుండి అంగన్వాడి కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని స్థానిక ఐసిడిఎస్ సిడిపిఓ బాలచం. ద్రామణి దేవి ప్రకటనలో తెలిపారు. విద్యను అందించడంలో అంగన్వా డీ కార్యకర్తలకు ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న6 సంవత్సరాల పిల్లలకు ప్రాథమిక ఆరోగ్య సంర క్షణ పోషణ మరియు విద్యను అందించడంలో కార్యకర్తలకు శిక్షణ నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నా రు. ఈ కార్యక్రమం ద్వారా బాలల కు ఇంట్లో ఉన్నటువంటి తల్లితండ్రులు ఎంత పరిమాణంలో ఆహార అందించాలి, నాణ్యతా పరిమాణం, పరిశుభ్రత కోసం తల్లులకు అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్ర మ ము లో శిక్షణ ఇవ్వడం జరుగు తుందన్నారు.20,21,22, నిర్వహిం చే ఈ శిక్షణ కార్యక్రమం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉంటుం దని ఆమె తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి అంగన్వాడి కార్యక ర్తలు అందరూ తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

గ్యాస్ కార్యాలయాన్ని తెరిపించండి

- భారత్ గ్యాస్ ఎదుట వినియోగదారుల ఆందోళన

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పట్టణంలోని సారికవీధిలో మూడు వారాలుగా మూతబడిన భారత్ గ్యాస్ కార్యాలయాన్ని తెరిపించి లబ్దిదారులకు సక్రమంగా గ్యాస్ సిలెండర్లు అందించాలని వినియోగదారులు భారత్ గ్యాస్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం, సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ పార్వతీపురం పట్టణం, సుదూరు ప్రాంత గ్రామాల భారత్ గ్యాస్ లబ్ధిదారులు గత 25 రోజులుగా సుమారు 800 మంది ఇండెంట్లు పెట్టి నేటి వరకు భారత్ గ్యాస్ సిలిండర్ రాక ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం నాయకులు గొర్లి వెంకట రమణ, పాకల సన్యాసిరావు, సంచాన ఉమా, బంకురు సూరిబాబు, లబ్దిదారులతో కలసి మండల తహశీల్దార్ జయలక్ష్మికి సమస్య వివరించారు. ఎమ్మార్వో సివిల్ సప్లై డీటీతో మాట్లాడి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. లబ్ధిదారులందరికీ రెండు రోజుల్లో గ్యాస్ రాకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని నాయకులు హెచ్చరించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

విశాలాంధ్ర జికె వీధి: గురువారం పాడేరు నియోజకవర్గం శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజ్ గూడెం కొత్త వీధి మండలం లో పర్యటించనున్నారని మండల పార్టీ అధ్యక్షులు తెలిపారు. దారకొండ గ్రామంలో దారాలమ్మ తల్లి ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకోనున్నారన్నారు. ఎంపీపీ, జడ్పిటిసి రాష్ట్ర జిల్లా నియోజకవర్గ అనుబంధ విభాగాల నాయకులు ఎంపీటీసీలు సర్పంచులు సీనియర్ నాయకులు ఈ యొక్క కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

కబేలాలకు మూగజీవాల అక్రమ రవాణా

విశాలాంధ్ర - సీలేరు: ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల నుండి తెలంగాణకు ఆవులు అక్రమంగా తరలిస్తున్నారని ప్రాంతీయులు ఆరోపిస్తున్నారు. కాలినడకన అక్రమంగా ఆవులను తరలిస్తున్నట్లు సమాచారం. వై.రామవరం మండలం నుండి వాహనాలలో ఆవులను ఎక్కించి దొంగదారుల్లో తరలిస్తున్నట్టు తెలుస్తుంది. ఆవులను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆవులను తమ ఏజెంట్ల ద్వారా సంతలలో కొనుగోలు చేసి ఆవులను తరలిస్తూ బయట తిరుగుతున్న తమ పశువులను సైతం తోలుకొని పోతున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ అక్రమ రవాణాపై అధికారులు తక్షణమే స్పందించాలని ప్రాంతీయులు కోరుతున్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాలను వైఎస్ఆర్సిపి మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు బాధిత గ్రామాలకు వెళ్లి బాధితులకు ధైర్యం చెప్పి నిత్యావసరాలు, ఆర్థిక సహాయం అందించారు. కుందులూరు పంచాయతీ, రామవరం పంచాయతీ పరిధిలో అగ్ని ప్రమాదం జరిగి సర్వస్వము కోల్పోయినా అగ్ని ప్రమాద బాధితులని కలిసి వారికీ ధైర్యం చెప్పి,ఆర్థిక సహాయం గా మూడు కుటుంబాలకు కలిపి 8000వేల రూపాయలు, నిత్యావసరాలు బట్టలు, బియ్యం వైయస్సార్సీపి మండల కమిటి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూట్ మెంబర్ బొడ్డు సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిది చిక్కాల బాలకృష్ణ(బాలు), మండల నాయకులు చినమ్మట్టపల్లి, సర్పంచ్ పిట్టా రామారావు, కుందులూరు సర్పంచ్ బంధం జయ, రేఖపల్లి ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి, ఎస్ సి సెల్ మండల నాయకులు మాచర్ల వెంగళరావు, బంధం రాజు, తెల్లం తమ్మయ్య, కన్నారావ్,మడకం కన్నారావు, వైస్ పెసిడెంట్ మాడి ముత్యాలరావు, కుంజా నాగేశ్వరావు,సోడి రామారావు,కారం గూడెం పటేల్ కారం బాబురావ్,తదితరులు పాల్గొన్నారు.

ప్రజలారా సహకరించండి... దొంగ కనెక్షన్లను నివారిద్దాం.. నీటి సమస్య పరిష్కరిద్దాం

విశాలాంధ్ర - చింతపల్లి :- పంచాయతీలోని పలు వీధులలో నెలకొన్న త్రాగునీటి సమస్య పరిష్కారానికి ప్రజా ప్రతినిధులుగా తాము, అధికారులు కృషి చేస్తున్నప్పటికీ కొంతమంది దొంగ కనెక్షన్లు ఏర్పాటు చేసుకోవడం వలన సమస్య పునరావృతం అవుతుందని ప్రజలందరూ సహకరిస్తే దొంగ కనెక్షన్ లను నివారిద్దామని స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీపీ కోరాబు అనూష దేవి లు అన్నారు. స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని సాయి నగర్ వీధిలో బుధవారం సర్పంచ్ దురియా పుష్పలత స్థానిక ఎంపీపీ కోరాబు అనుషా దేవి, ఎంపిడిఓ శ్రీనివాసరావు, గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈ స్వర్ణ లత, పంచాయితీ కార్యదర్శి శ్రీధర్ , గుమాస్తా అంబేద్కర్లతో కలిసి సాయి నగర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా సాయినగర్ వీధిలో త్రాగునీటి సమస్య తలెత్తకూడదని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్మన్ జల్లిపల్లి సుభద్ర ను అడిగి బోర్ వేయించి పంచాయితీ నుండి మోటార్ వేసి ట్యాంక్ నిర్మించి నీటి సరఫరా ప్రారంభించి నప్పటికి, మోటార్ నుండి ట్యాంకుకు వెళ్లే ప్రధాన పైపుకి దొంగ కనెక్షన్లు పెట్టి కొంతమంది వ్యక్తులు ఇళ్ళలోకి నీటిని పట్టుకొని 200 , 300 కి అమ్ముకుంటున్నారని, అడగటానికి వెళ్ళిన పంచాయితీ సిబ్బంది పై దౌర్జన్యానికి దిగుతున్నారని ఈ కారణాల వల్ల ట్యాంక్ నిండక పోవడం వల్ల నీటి సరఫరా పూర్తిస్థాయిలో జరగట్లేదన్నారు, ప్రజలు కూడా పంచాయితీ పాలకవర్గం, అధికారులకు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు , ప్రజలు పూర్తి స్థాయిలో సహకరిస్తే దొంగ కనెక్షన్లు తొలగించి ప్రజలకు నీటిని అందిచగలమని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ముత్తా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణాలను ప్రోత్సహిస్తున్నది రెవెన్యు అధికారులే...!

విశాలాంధ్ర - హుకుంపేట/పాడేరు:మండల కేంద్రంలో అక్రమ దారులతో రెవెన్యు అధికారులు లోపాయికార ఒప్పందం కుదుర్చుకుని భూ ఆక్రమణలను అధికారులే ప్రోత్సహిస్తున్నారనీ, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉప అధ్యక్షులు టి క్రిష్ణరావు పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో భు ఆక్రమణలు,అక్రమ నిర్మాణాలపై ప్రజలు మరియు గిరిజన సంఘం అందజేసిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేసి, అక్రమార్కుల నుండి పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం జనవరి నెలలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రెవెన్యు సదస్సులో,మండలంలో జరుగుతున్న ఆక్రమణాలపైన,అక్రమ నిర్మాణాలపైనా ఆదివాసీ గిరిజన సంఘం అందజేసిన ఫిర్యాదులపై,నేటికీ అధికారులు స్పందించకపోవడమే అందుకు నిదర్శనం అన్నారు. భూ యజమానులకు,పట్టదారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, ఆన్లైన్లో వారి యొక్క వివరాలు సెర్చ్(పరిశీలించడం)చేయడం వాస్తవంగా చట్ట రీత్యా నేరం అన్నారు. ఐనప్పటికీ వారికి తెలియకుండా వారియొక్క సర్వే నెంబర్లను,పాసు పుస్తకాల ఖాతా నెంబర్లను, మార్చివేస్తున్నారు, తద్వారా క్రయ విక్రయాలకు ప్రోత్సహిస్తూ సొమ్ముచేసుకొంటున్నారు. ఇదేమని అధికారులకు ప్రశ్నిస్తే! మన చేతుల్లో పనేకదా మళ్ళీ మార్చెద్దాం అంటూ సమాధానం ఇస్తు బ్లాక్ మేల్ చేస్తున్నారాన్నారు.సాగర సత్యవతికి చెందిన భూ సర్వే నెంబర్ తొలగించి వారికి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని వారు గుర్తు చేశారు. మంగళవారం కలక్టరేట్ నుండి కలెక్టర్ విడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ మండలల్లో అభ్యంతరకరమైన, పోరంబోకు భూములను ఆక్రమించిన వారికి నోటీసులు ఇవ్వాలనీ, భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములను రక్షించాల్సిన బాధ్యత రెవెన్యు అధికారులదే అనడం, హుకుంపేట రెవెన్యు అధికారులకు మాత్రం మరింత లంచాల పంట పండినట్టే అన్నారు. చిత్తశుద్ధితో అక్రమ నిర్మాణాలను, ప్రభుత్వభూముల ఆక్రమణాలను రక్షించాలనే ఉద్దేశమే ఉంటే,ప్రత్యేకంగా ఒక జిల్లాస్థాయి కమిటీని నియమించి సర్వేలు చేపట్టలన్నారు.

బ్యాంకు అధికారుల చేతివాటం

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం తంటికొండ పంచాయితీ వట్టిగడ్డ గ్రామానికి చెందిన 33 డ్వాక్రా గ్రూపులకు గాని 15 డ్వాక్రా గ్రూపుల్లో యూనియన్ బ్యాంక్ ద్వారా రుణాల మంజూరు చేసి తిరిగి తీసేసిన సంఘట తెలిసిందే. అయితే బుధవారం మధ్యాహ్నం వెలుగు ఏపీఎం రామాంజనేయులు, సీసీలు,ఎంఎంఎస్ లీడర్స్ ఆధ్వర్యంలో వట్టిగడ్డ డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి విచారణ చేపట్టగా ఎటువంటి అనుమతులు, తీర్మానాలు లేకుండా బ్యాంకులో రుణాల మంజూరు చేసి డ్వాక్రా సంఘాల్లో జమ చేయడం, తిరిగి తీసేయడం వంటి అవకతవకలు జరిగినట్లు గుర్తించామని ఏపిఎం వీరాంజనేయులు తెలిపారు,33 గ్రూపులో 15 గ్రూపులకు బ్యాంకు రుణాలు మంజూరు చేసి గ్రూపు సభ్యులకు తెలియకుండానే 2 కోట్ల 62 లక్షల 98 వేలు లావాదేవిలు జరిగినట్లు గుర్తించామన్నారు,దీంట్లో ఈ 15 గ్రూపులకు సుమారు 51000 వడ్డీ పడినట్లు ఆయన తెలిపారు,అయితే ఈ అవతవకలకు బ్యాంకు మేనేజర్ కు వివో లీటర్లు సపోర్ట్ చేయడం జరిగిందని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు వెంటనే వివో లీడర్ ని తొలగించాలంటూ డ్వాక్రా మహిళలు వెలుగు అధికారులును కోరారు అలాగే తమ సమస్యలను పరిష్కరించాలంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.